క్లుప్తంగా

పాలవెల్లువతో ఎన్నో ప్రయోజనాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామచంద్రమూర్తి

ఎస్.రాయవరం : జగనన్న పాలవెల్లువ పథకం పాడి రైతులకు మరిన్ని సదుపాయాలు కల్పిస్తోందని ఎంపీడీవో రామచంద్రమూర్తి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో జగనన్న పాలవెల్లువలో రైతులకు కలిగించే ప్రయోజనం వివరించారు. గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల ద్వారా రైతులకు అమూల్ పాల సేకరణ, వాటి ఉత్పత్తుల విక్రయం వంటి పథకాలు వివరించాలన్నారు. పాలవెల్లువలో సభ్యత్వం ఉన్న రైతులకు రాయితీ రుణాలు ఇచ్చే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శివప్రసాద్, సీసీలు, వెలుగు సిబ్బంది ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు

కోటవురట్ల: మేలుకొలుపును పలు గ్రామాలలో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. తెల్లవారు జామున 4 గంటలకే ఆలయాలకు చేరుకుని పూజలు చేసి నగర సంకీర్తన చేస్తూ మేలుకొలుపు నిర్వహిస్తున్నారు. పాములవాకలో బుధవారం తెల్లవారు జామున మేలుకొలుపు నిర్వహించారు. భక్తులు రామాలయానికి చేరుకుని పూజలు చేశారు. అనంతరం నగర సంకీర్తన చేశారు. చిన్నారులు సైతం పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిని చాటారు.

విద్యార్థులకు క్రిస్మస్ కానుకలు



గొల్లపేట ఎంపీపీ స్కూల్లో విద్యార్థులకు క్రిస్మస్ కానుకలు ఇస్తున్న ఉపాధ్యాయులు

కోటవురట్ల : క్రిస్మస్ అంటే కానుక సంబరం.. శాంతాక్లాజ్ చిన్నారులకు బహుమతులను అందించి ప్రేమను పంచుతారు. గొల్లపేట ఎంపీపీ స్కూల్‌లో క్రిస్మస్ కానుకల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. హెచ్‌ఎం జీవన్, ఉపాధ్యాయురాలు కుమారి విద్యార్థుల సంతోషం కోసం క్రిస్మస్ కానుకలు పంపిణీ చేశారు. విద్యార్థులతో గిఫ్ట్ బాక్సులను తెరిపించి దుస్తులు, స్వీట్స్, కేక్, చాక్‌లెట్లు అందించారు.

వమ్మవరంలో వాలీబాల్ పోటీలు



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ సూరిబాబు

ఎస్.రాయవరం : గ్రామాల్లో ఆడుదాం ఆంధ్రా క్రీడలు రెండవ రోజు బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, క్రికెట్ క్రీడలు నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో సచివాలయ స్థాయిలో నిర్వహించిన క్రీడలు ఫైనల్స్‌కు చేరాయి. సచివాలయాలు వారిగా నిర్వహించిన విజేతలకు మండల స్థాయి పోటీలకు సిద్ధం అవుతున్నారు. ఈ క్రీడలు సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు సంరక్షణలో నిర్వహించారు. ఉప్పరాపల్లి గ్రామంలో కబడ్డీ జట్టు ఫైనల్‌కు చేరుకున్నాయి. తిమ్మాపురం, ఎస్.రాయవరం గ్రామాల్లో క్రికెట్ కూడా నిర్వహించారు.

ఓటరు జాబితాలపై దృష్టి సారించాలి

మునగపాక : బీఎల్‌వోలు ఓటరు నమోదుపై దృష్టి సారించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కుమార్ కోరారు. రెవెన్యూ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన బీఎల్‌వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితాల్లో తేడాలున్నాయని వాటిని సరిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానంగా మృతి చెందిన వారిని జాబితాల నుంచి ఇంకా తొలగించలేదని తక్షణమే తగు విచారణ చేపట్టి అటువంటి తేడాలను సవరించాలన్నారు.

విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకోండి

తుమ్మపాల: దేశంలో వెనుకబడిన 56 బీసీ కులాలకు విశ్వకర్మ యోజన పథకం ద్వారా అతి తక్కువ వడ్డీకి రూ.2 లక్షల వరకు కేంద్ర ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసరావు అన్నారు.

ఆరోగ్యానికి, క్రీడా స్ఫూర్తికి ఆడుదాం..ఆంధ్రా



మాసాహేబుపేటలో క్రికెట్ ఆడుతున్న మహిళలు



పాములవాకలో క్రీడాకారులతో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు



రాజానగరంలో ఆడుదాం - ఆంధ్రా జట్టు



అచ్యుతాపురం పోలీస్ గ్రౌండ్‌లో నిర్వహించిన క్రీడల్లో భాగంగా క్రీడాకారుల్ని పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

అచ్యుతాపురం : నిరంతరం ఆటల సాధన, వ్యాయామం చేయడం ద్వారా రోగాలను దరిచేయకుండా చేసుకోవచ్చని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా అచ్యుతాపురం పోలీస్ గ్రౌండ్స్‌లో బుధవారం ఆటల పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న మేటి క్రీడాకారుల్ని వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్రా.. నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడలకు ప్రోత్సాహం ఇస్తున్న ఈ ప్రభుత్వంలో క్రీడాకారులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, కోన బుజ్జి, దేశంశెట్టి శంకర్‌రావు, లాలం రాంబాబు, నర్మాల కుమార్, వెంకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

కోటవురట్ల: మండలంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు హుషారుగా సాగుతున్నాయి. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీలలో పాల్గొంటున్నారు. మండలంలోని 19 గ్రామ సచివాలయాల పరిధిలో క్రికెట్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు జరుగుతున్నాయి. పాములవాక జెడ్పీ హైస్కూల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు క్రీడాకారులకు క్రీడా సామగ్రి అందించి ప్రతిభను చాటేందుకు ఇది అద్భుతమైన వేదికగా పేర్కొన్నారు. కె.వెంకటాపురంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొల్లు చిట్టిబాబు, పైల నాని, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, చౌడువాడలో సర్పంచ్ గోపాలకృష్ణ క్రీడాకారులకు కిట్లు అందజేసి అభినందనలు తెలిపారు.

ఆటలపోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటున్న మహిళలు

పాయకరావుపేట : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఆడుదాం - ఆంధ్రా ఆటల పోటీలు రసవత్తరంగా, ఎంతో ఉత్సాహంగా జరుగుతున్నవి. మండలంలో గల 25 గ్రామ సచివాలయాల పరిధిలోను రెండవ రోజు క్రికెట్ పోటీలు మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. మండలంలో 50 క్రికెట్ మహిళ జట్లు ఆటల్లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆయా గ్రామ సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది, గ్రామ వలంటీర్లు ఎంతో ఉత్సాహంగా ఆటలు నిర్వహిస్తున్నారు. పాయకరావుపేట, మాసాహేబుపేట, రాజానగరం, సత్యవరం, మంగవరం, ఎస్.నర్సాపురం, పెంటకోట తదితర గ్రామాల్లో మహిళలు క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు.

యలమంచిలి చేరిన అయోధ్య రామయ్య అక్షింతలు

- మేళతాళాలతో ఘనస్వాగతం పలికిన భక్తులు



పట్టణంలో అయోధ్య శ్రీరాముని అక్షింతల ఊరేగింపు చేపడుతున్న శ్రీరామ భక్తులు



గోకివాడలో మేలుకొలుపులో పాల్గొన్న భక్తులు

యలమంచిలి రూరల్ : అయోధ్యలో జరుగుతున్న శ్రీరాముని దివ్య భవ్య మందిర ప్రారంభోత్సవం వచ్చే ఏడాది జనవరి 22న జరగనున్న నేపథ్యంలో దేశంలోని ప్రతి హిందూ కుటుంబానికి అయోధ్యలోని బాల రాముని పూజలో ఉపయోగించిన అక్షతలు,రామాలయ చిత్రపటం చేర్చాలని శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ నిర్ణయించింది. దీనిలో భాగంగా బుధవారం అయోధ్య రాముని అక్షతలు శ్రీరామ సేవకుల ద్వారా యలమంచిలి చేరుకున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారి, రైల్వేస్టేషన్ రోడ్డు మీదుగా శ్రీరాముని ఆలయం వరకూ జరిగిన జనజాగరణ ఊరేగింపు ఆద్యంతం శ్రీరామ నామస్మరణతో శోభాయమానంగా జరిగింది. గ్రామాల నుంచి వచ్చిన భజన, కోలాట బృందాలు, ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్, సమరసత ఫౌండేషన్‌ల ప్రతినిధులు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. అయోధ్య రాముని పూజిత అక్షింతలకు పూజలు చేసిన అనంతరం గ్రామాల వారీగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అధ్యక్షుడు ఆడారి వెంకట రెడ్డినాయుడు, నగిరెడ్డి రమణ, పడాల శ్రీరాములు, కట్టా సత్యనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

గోకివాడలో మేలుకొలుపు

రాంబిల్లి: గోకివాడలో బుధవారం అయోధ్య రామయ్య అక్షింతలతో భక్తులు మేలుకొలుపు నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేలుకొలుపులో భక్తులు నగర సంకీర్తన చేశారు. మండలంలో పలు గ్రామంలో ధనుర్మాసంలో మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

గ్రామాల్లో చురుగ్గా సంక్షేమం, అభివృద్ధి

- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- మునగపాకలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం



విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



మునగపాక దళితవాడకు వెళ్లే రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : గ్రామాలాభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సేవలందిస్తున్నారని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు అన్నారు. మునగపాకలోని దళితవాడకు వెళ్లే రోడ్డు అలాగే హైస్కూల్ దరి మండల పరిషత్ నిధులతో నిర్మించిన రహదారి, వెంకటాపురంలో ఆర్‌హెచ్‌ఐ కంపెనీ సహకారంతో నిర్మించిన రోడ్డు, శ్మశానవాటిక ప్రహరీ తదితర అభివృద్ధి పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణమూర్తిరాజు మాట్లాడుతూ ఒకవైపు సంక్షేమం మరో వైపు అభివృద్ధి గ్రామాల్లో చురుగ్గా సాగుతున్నాయన్నారు. సచివాలయం అలాగే వలంటీర్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చాక ప్రజలకు సకాలంలో సేవలందుతున్నాయన్నారు. రహదారులు, డ్రైనేజీ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, సుందరపు తాతాజీ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, వెంకటాపురం ఉప సర్పంచ్ బొమిరెడ్డిపల్లి సాయివరం, మార్కెట్‌కమిటీ మాజీ చైర్‌పర్సన్ పిల్లి కనక లక్ష్మి అప్పారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు పేర్కొన్నారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం ఆయన 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా రమణమూర్తిరాజు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు పలు పథకాలను అందుబాటులోకి తీసుకువస్తున్నారన్నారు. సాంకేతిక రంగంలో రాణించేందుకు 8వ తరగతి నుంచి విద్యార్థులకు మెరుగైన సేవలందిస్తున్నారన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు.

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కారం అవుతాయి



అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

అచ్యుతాపురం : అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల్ని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. అచ్యుతాపురం పోలీస్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రాలో పాల్గొనేందుకు విచ్చేసిన ఎమ్మెల్యే కన్నబాబును అంగన్‌వాడీ సిబ్బంది కలిసి వినతి పత్రం అందజేశారు. జీతాలు పెంచాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ప్రకటించాలని కోరారు. దీనిపై కన్నబాబు స్పందిస్తూ అంగన్‌వాడీలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, జి.దేవుడు నాయుడు, కూండ్రపు సోమునాయుడు, చందక రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు నివారణపై ఇంటింటా అవగాహన



పట్టణంలో గృహ సందర్శనలో పాల్గొన్న లెప్రసీ అధికారి బాలాజీ

పాయకరావుపేట : కుష్ఠు వ్యాధిపై వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వ్యాధిపై అవగాహన కల్పించాలని జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ బాలాజీ అన్నారు. పట్టణంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ నెల 27 నుంచి జనవరి 12 వరకు 14 రోజులు పాటు ప్రతి ఇంటికి వైద్య సిబ్బంది తిరిగి వ్యాధిపై సర్వే నిర్వహించి, అవసరమైన వారికి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో 2 బృందాలుగా 14 రోజులు పాటు గృహ సందర్శనలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆయన వైద్య సిబ్బందితో పట్టణంలో గల ఇళ్లకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ సుభాష్, డాక్టర్ సౌందర్య, ఎంపీహెచ్‌వో పి.వి.రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో కోతుల నియంత్రణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

యలమంచిలి : పట్టణంలో కోతుల నివారణకు చర్యలు చేపట్టనున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో తెలిపారు. పట్టణంలో ప్రధాన సమస్యగా మారిన కోతుల బెడద వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న దృష్ట్యా కోతులను అరికట్టడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కౌన్సిల్ సమావేశంలో ఆమె అధికారులను ఆదేశించారు. పట్టణంలో అన్ని వార్డుల్లో మరమ్మతులకు గురైన విద్యుద్దీపాలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. టిడ్కో గృహాల వద్ద రక్షిత మంచి నీటి సదుపాయానికి అధికారులు చొరవ చూపాలన్నారు. వార్డుల్లో సమస్యలను కౌన్సిల్ సభ్యులు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె కౌన్సిల్ సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, కౌన్సిలర్లు పిట్టా సత్తిబాబు, షేక్ సయ్యద్ బీబీ, మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు మున్సిపల్ మేనేజరు ప్రభాకరరావు, టౌన్ ప్లానింగ్ అధికారిణి శ్రీలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, ఆర్వో నీలిమ పాల్గొన్నారు.

ఉచితంగా ఎరువులు, విత్తనాల పంపిణీ



రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

రాంబిల్లి : హరిపురం బీసీటీ కేవీకేలో బుధవారం రైతులకు ఎరువులు, క్రిమిసంహారక మందులు, నువ్వు విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రభుత్వం వీటిని కేవీకేల ద్వారా ఉచితంగా అందజేస్తుంది. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కేవీకే ప్రధాన శాస్త్రవేత్త శైలజ సూచించారు. రబీ సీజన్‌కు సంబంధించి వీటిని రైతులకు అందజేయడం జరిగిందన్నారు. శాస్త్రీయ సలహాలు పాటిస్తూ సాగు చేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని కేవీకే శాస్త్రవేత్త బుర్ల శ్రీహరి అన్నారు. రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల యాజమాన్యం పాటించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో హరిపురం సచివాలయం కన్వీనర్ ధూళి అప్పారావు(బుజ్జి) పలువురు రైతులు పాల్గొన్నారు.

గోతుల పూడ్చివేత



గోతులు పూడ్చివేత పనులు

రాంబిల్లి : నారాయణపురం-దిమిలి రోడ్డుపై ఏర్పడిన గోతుల పూడ్చివేత పనులు పూర్తయ్యాయి. ఈ రోడ్డుపై పలుచోట్ల గోతులు ఏర్పడడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడేవారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు గోతులు పూడ్చివేత పనులు చేపట్టారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నూకాంబిక ఆలయానికి ప్రత్యేక ఆకర్షణగా మండపం



శిలకు పూజలు చేస్తున్న మురళీకృష్ణ, ప్రసాద్, దాడి రత్నాకర్, జయవీర్

అనకాపల్లి: నూకాంబిక ఆలయానికి ఉత్సవ మండపం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్, పార్టీ యువనేత దాడి జయవీర్‌లు అన్నారు. పట్టణంలోని గవరపాలెం నూకాంబిక ఆలయంలో ఉత్సవ మండపాన్ని దాత దాడి సన్యాసిరత్నం(అమ్ములు)తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రత్యేక కుంకుమార్చనలకు మండపం ప్రధాన కేంద్రంగా నిలుస్తుందన్నారు. అంతకు ముందు ఆలయంలో ఏర్పాటు చేసిన శిలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జాజుల ప్రసన్నలక్ష్మి, కొణతాల నీలిమ, పీలా లక్ష్మీసౌజన్య, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, ఎన్టీఆర్ వైద్యాలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి, వార్డు ఇన్‌చార్జిలు కొణతాల భాస్కర్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు బుద్ధ నర్సింగరాజు, పీలా లక్ష్మీశ్రీనివాసరావు, ఆడారి ఉమాశ్రీనివాసరావు, కొండూరు రవీంద్రనాథ్, గొల్లవిల్లి నర్సింగరావు, కంటపల్లి శోభారాణి, అర్చకులు యనమండ్ర శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్లు బొడ్డేడ శివ, శిలపరశెట్టి బాబీ, గవరపాలెం గౌరీపరమేశ్వరుల కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, పలు ఆలయాల చైర్మన్‌లు పాల్గొన్నారు.

25 మందికి ఉచిత కంటి చికిత్సలు



కాటరాక్ట్ సర్జరీ చేసుకున్న వృద్ధుడిని బస్సులోంచి దించుతున్న దృశ్యం

అచ్యుతాపురం : ఈ నెల 24న బ్రాండిక్స్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో కాటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని వైద్యులు సూచించిన మేరకు విశాఖలో కంటి ఆస్పత్రిలో సర్జరీలు పూర్తి చేశారు. ఈ మేరకు 25 మందిని బ్రాండిక్స్ తన సొంత వాహనాల్లో విశాఖ నుంచి తీసుకొచ్చి వారి స్వగ్రామాలకు తరలించారు.

హంస వాహనంపై స్వామివారు



హంస వాహనంపై స్వామివారి తిరువీధి సేవలో అర్చకులు

నక్కపల్లి : ఉపమాక గరుడాద్రి పర్వతంపై వేంచేసిన శ్రీకల్కి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి ఉత్సవ మూర్తులకు హంస వాహనంపై తిరువీధిసేవ జరిగింది. ఆలయ అర్చకబృందం ఆధ్వర్యంలో నిత్య కార్యక్రమాలతో పాటు శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి హంస వాహనంపై, గోదాదేవి అమ్మవారిని పల్లకీలో గ్రామంలో తిరువీధి సేవ నిర్వహించారు. సాయంత్రం రాపత్తు అధ్యయన ఉత్సవంలో భాగంగా ఆస్థాన మండపంలో ద్రావిడ వేద ప్రబంధ పారాయణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

కలశ జ్యోతి, శూలాల ప్రదర్శన

అనకాపల్లి: పట్టణంలోని గవరపాలెం గంగిరేవు చెట్టు వద్ద శ్రీగంగపరదేశమ్మ భవానీ భక్తుల ఆధ్వర్యంలో దుర్గమ్మ చండీయాగం, కలశజ్యోతి ప్రదర్శన బుధవారం నేత్రపర్వంగా జరిగింది. అంతకు ముందు భవానీ భక్తులు శూలాలు ధరించి నిర్వహించిన అమ్మవారి ఘటాల ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో భవానీ భక్తులు కాండ్రేగుల శ్రీరాం, మద్దాల శ్రీను, కె.సుబ్బు, కె.వెంకట, బి.వర, వి.మహేష్, ఎం.గోపి, బి.ఆది, ఎం.సుబ్బు, పి.యుగంధర్, కె.సాంబ, గంగపరదేశమ్మ ఆశ్రమ భక్తులు పాల్గొన్నారు.